# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 02-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతులను పురస్కరించుకొని పలువురు ప్రముఖులు ఈరోజు ఘనంగా నివాళులు అర్పించారు.
- ❖ ఫ్లైదుబాయ్ విమానం ఘటనలో 180 మంది ప్రాణాలను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ టెలీఫోన్‌లో సంభాషించారు.
- ❖ జీ-20 సభ్య దేశాల వాణిజ్య మంత్రులతో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాల బలోపేతంపై చర్చలు జరిపారు.
- ❖ జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత్ 16 స్వర్ణ పతకాలతో 5వ స్థానానికి చేరుకుంది.

========================

మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతులను పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘ్వాల్, జితేంద్ర సింగ్, ఎల్. మురుగన్ ఈరోజు న్యూఢిల్లీలోని సంవిధాన్ సదన్‌లో పుష్పాంజలి ఘటించారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, కాంగ్రెస్ అధ్యక్షులు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, పార్లమెంట్ సభ్యులు, పార్లమెంట్ సీనియర్ అధికారులు, పాఠశాల విద్యార్థులు కూడా నివాళులర్పించారు.

========================

దుబాయ్ నుండి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమాన ప్రయాణంలో కో-పైలట్ చేసిన దాడిని ఎదుర్కొని, 180 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు టెలీఫోన్‌లో

మాట్లాడారు. ఈ సందర్భంగా కెప్టెన్ మచ్చర్ ఆ సంఘటన సమయంలో తనకు ధైర్యాన్నిచ్చిన అంశాలను ప్రధానమంత్రికి వివరించారు. నరేంద్ర మోదీ.. ఆయన ధైర్యాన్ని ప్రశంసించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. యావత్ దేశం ఆయన కోసం ప్రార్థిస్తోందని పేర్కొంటూ.. కెప్టెన్ స్మిత్ ధైర్యం, సమయస్ఫూర్తి ఎన్నో ప్రాణాలను కాపాడాయని అన్నారు. భారతీయులు ప్రాణాలు తీసేవారు కాదని, ఇతరులను కాపాడటానికి తమ ప్రాణాలను పణంగా పెట్టడానికి సిద్ధంగా ఉంటారని, దేశం గర్వంగా చెప్పుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా కెప్టెన్ మచ్చర్.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే తనకు ఆదర్శమని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వాణిజ్య వక్రీకరణలను సరిదిద్దడానికి డబ్ల్యూటీఓ (WTO) నిబంధనలకు అనుగుణమైన విధానం అవసరమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. అమెరికాలోని మిల్వాకీలో జరిగిన జీ-20 వాణిజ్య మంత్రుల ముగింపు సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ అని పేర్కొన్నారు. డిజైన్ నుండి పూర్తయిన వస్తువుల వరకు భారత్.. తయారీ విలువ గొలుసులను నిర్మిస్తోందని చెప్పారు. భారతదేశ తయారీ సామర్థ్యం దేశీయ, ప్రపంచ అవసరాలను తీరుస్తుందన్నారు. కాగా.. జీ-20 వాణిజ్య మంత్రుల సమావేశం సందర్భంగా పీయూష్ గోయల్.. ఫ్రాన్స్, కెనడా, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా దేశాల వాణిజ్య మంత్రులతో చర్చలు జరిపి, ఆయా దేశాలతో ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

జపాన్‌లోని ఐచి-నగోయాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో 13వ రోజైన ఈరోజు భారత క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి, హాకీ, బాక్సింగ్, రెజ్లింగ్, ఆర్చరీలో 6 స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. భారత మహిళల హాకీ జట్టు ఫైనల్‌లో చైనాను ఓడించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. భారత రెజ్లర్ సుజీత్ కల్కాల్ పురుషుల 65 కిలోల ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. బాక్సింగ్‌లో, మహిళల 65 కేజీల విభాగంలో పర్వీన్ హూడా ఫైనల్‌లో చైనీస్ తైపీకి చెందిన నీన్-చిన్ చెన్‌ను ఓడించి.. స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. పురుషుల 80 కిలోల విభాగంలో ఫైనల్‌లో, అంకుష్ పంఘల్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. భారత స్టార్ మహిళా బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ 75 కేజీల విభాగంలో ఫైనల్‌లో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆర్చరీలో, మహిళల రికర్వ్ జట్టు స్వర్ణపతకం సాధించింది. ఈ ప్రదర్శనలతో పతకాల పట్టికలో భారత్ మొత్తం 76 పతకాలతో 5వ స్థానానికి చేరుకుంది. ఇందులో 16 స్వర్ణ, 25 రజత, 35 కాంస్య పతకాలు ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ దార్శనికతకు పరిశుభ్రత కేంద్రబిందువుగా ఉందని కేంద్ర ఓడరేవులు, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఇందిరా డాక్‌లోని గ్రే గేట్ వద్ద ముంబై పోర్ట్ అథారిటీ ఈరోజు నిర్వహించిన `స్వచ్ఛతా అభియాన్ 2026` కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ముంబై పోర్ట్ అథారిటీ నిర్వహిస్తున్న జవహర్ ద్వీప్ మెరైన్ ఆయిల్ టెర్మినల్‌ను ప్లాస్టిక్ రహిత ఆయిల్ టెర్మినల్‌గా ప్రకటించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ శాంతి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న అవిశ్రాంత కృషిని రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించడం భారతీయులందరికీ గర్వకారణమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పుతిన్ వ్యాఖ్యలు.. నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ శాంతికి ఒక విశ్వసనీయ దేశంగా మారిందని చాటి చెబుతున్నాయని సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు. అశాంతి నెలకొన్న సమయాల్లోనూ.. సమస్యలకు పరిష్కారాలు యుద్ధభూమిలో కాకుండా చర్చలు, దౌత్యం ద్వారానే లభిస్తాయన్న సందేశాన్ని ప్రధానమంత్రి అందించారని చెప్పారు. విపత్తుల వంటి పరిస్థితుల్లో నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ఎల్లప్పుడూ సహాయం అందించడానికి ముందుకొచ్చిందని, ఇది `వసుధైవ కుటుంబకం` అనే భారత సంప్రదాయానికి కొత్త గుర్తింపును తెచ్చిపెట్టిందని అమిత్ షా వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వైద్య రంగంలోని అన్ని ప్రత్యేక విభాగాలలో రోబోటిక్స్ కీలక సాధనంగా మారబోతోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖా మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన సొసైటీ ఆఫ్ రోబోటిక్ సర్జరీ (SRS) అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ... దేశ ఆరోగ్య సంరక్షణ అవసరాల కారణంగా కొత్త సాంకేతికతలను స్వీకరించడం ఆవశ్యకమని చెప్పారు. రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నానోసైన్స్ అనేవి ఆరోగ్య సంరక్షణ కోసం ఒక వ్యవస్థను సృష్టిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్‌లో రోబోటిక్ మెడిసిన్, రోబోటిక్ ఎండోక్రినాలజీ, రోబోటిక్ కార్డియాలజీ వంటివి ఆవిర్భవించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఆరోగ్య సేవలను అందించడంలో ఏఐ, రోబోటిక్స్.. శక్తివంతమైన సహాయక సాధనాలుగా ఉపయోగపడతాయని జితేంద్ర సింగ్ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వందే భారత్ రైలు చీనాబ్, అంజి వంతెనలను గంటకు 100 కిలోమీటర్ల వేగంతో దాటడం ద్వారా రైల్వే ఈరోజు ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించిందని ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భారతదేశపు మొట్టమొదటి కేబుల్-స్టేడ్ అంజి వంతెనను గంటకు 100 కిలోమీటర్ల వేగంతో దాటి కొత్త రికార్డు సృష్టించింది. అలాగే.. 111 కిలోమీటర్ల పొడవైన శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా - బనిహాల్ సెక్షన్‌లో గంటకు 75 కిలోమీటర్ల నుండి 100 కిలోమీటర్లకు పెంచిన గరిష్ట వేగాన్ని ఈరోజు విజయవంతంగా పరీక్షించారు. వీటి ద్వారా రైలు కార్యకలాపాలు మరింత సులభతరం అవుతాయని, ప్రయాణ సమయం తగ్గి... ప్రయాణికులకు వేగవంతమైన, సురక్షితమైన ప్రయాణం లభిస్తుందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గాంధీ జయంతి సందర్భంగా.. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (KVIC) చైర్మన్ మనోజ్ గోయల్ ఈరోజు న్యూఢిల్లీలో `ఖాదీ మహోత్సవ్`ను ప్రారంభించారు. అలాగే.. దేశవ్యాప్తంగా వర్తించే ఒక ప్రత్యేక రాయితీ కార్యక్రమాన్ని కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గడచిన 12-13 సంవత్సరాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఖాదీ వ్యాపారం రెండు లక్షల కోట్ల రూపాయల మైలురాయిని అధిగమించి.. ఒక నూతన చరిత్రను సృష్టించిందన్నారు. ఖాదీ నేడు యువతకు ఒక `ఫ్యాషన్ స్టేట్‌మెంట్`గా మారిందని పేర్కొంటూ.. అభివృద్ధి చెందిన భారతదేశం అనే లక్ష్యాన్ని సాకారం చేయడంలో ఖాదీ కీలక పాత్ర పోషిస్తుందని మనోజ్ గోయల్ వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ ప్రాంతంలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్.. ఉద్యానవన రంగాన్ని బలోపేతం చేస్తుందని, రైతులకు మెరుగైన అవకాశాలను కల్పిస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లెలో రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్ట్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ లకు ఆమె ఈరోజు శంకుస్థాపన చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =